**సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి చొరవతో గుత్పా, అలీసాగర్ ఆయకట్టుకు సాగునీరు.**

మంత్రి ఉత్తమ్ తో ఫోన్ లో సంభాషించిన ఎమ్మెల్యేలు. - నీటి విడుదలకు అధికారులకు ఆదేశాలు.

4లో


ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

RNI NO. APTELL/ 2006/18110

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక


**గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలి. శాంతి కమిటీ సమావేశంలో ఆర్మూర్‌రూరల్ సిఐ జాన్‌రెడ్డి.**

3లో

నిజామాబాద్ సంపుటి : 20 సంచిక : 287 శనివారం 25 - 09 - 2026 పబ్లిషర్ : కొక్కు రవికుమార్ krk7018@gmail.com పేజీలు :4 రూ॥ 1/-

## సొంత పార్టీని ముంచేస్తున్న

# నేతల దూకుడు

### కాంగ్రెస్ పార్టీలో నెక్ట్స్ ఏ సీనియర్ టార్గెట్?



రాజకీయ పార్టీల కీలక నేతలు.. సమయం, సందర్భం వచ్చినప్పుడు ఓ మాట చెబుతుంటారు. నోరు అదుపులో పెట్టుకోవాలని, మీడియాకు ఎట్టి పరిస్థితుల్లోనూ మసాలా ఇవ్వవద్దని అంటుంటారు. కానీ, కొందరు నేతలు తమకు ఎదురులేదని భావిస్తుంటారు, మా పార్టీలో మేమే తోపులమని అంచనాలు వేసుకుంటారు. ఫలితంగా వారి పీఠాలకు ఎసరు వస్తున్న సందర్భాలు ఉన్నాయి. తెలంగాణ అధికార పార్టీలో కొండా సురేఖ, చిన్నారెడ్డి ఉదంతాలే అందుకు నిదర్శనం. జాతీయ స్థాయిలో అయితే చాలామంది నేతలు పత్తా లేకుండా పోయారు. నోరు జారిన జాబితాలో మరో అరడజను మంది సీనియర్లు ఉన్నట్లు తెలుస్తోంది. తాజా ఎపిసోడ్‌తో ఆయా నేతల్లో వణుకు మొదలైంది.

2లో

# సీఎం యోగి కాన్వాయ్ సమీపంలో పేలుడు,

## ఉలిక్కిపడిన అధికారులు, మధుర వెళ్లే దారిలో ఘటన



యూపీ సీఎం యోగి ఆధిత్యనాథ్ టూర్‌లో భద్రతా లోపం స్పష్టంగా కనిపించింది. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా వేడుకలకు మధుర వస్తుండగా దారిలో భారీ శబ్దంతో విస్ఫోటనం సంభవించింది. వెంటనే అధికారులు అలర్ట్ అయ్యారు. ఈ ఘటనకు సంబంధించి కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు అసలు ఏం జరిగింది? శ్రీకృష్ణ జయంతిని సందర్భంగా రెండు రోజుల పర్యటన నిమిత్తం ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మధుర వెళ్తున్నారు. దారిలో స్వామి హరిదాస్ ఆడిటోరియంతో పలు ప్రాజెక్టులను ప్రారంభించి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఉత్తర ప్రదేశ్ బ్రజ్ తీర్థ వికాస్ పరిషత్ బోర్డు సమావేశం నిర్వహించి, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వివాంటా హోటల్‌కు బయలుదేరారు. గురువారం సాయంత్రం సుమారు 5:30 గంటలకు గీతా రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నుండి బయలుదేరి పాగల్ బాబా మోర్, చైతన్య విహార్ మీదుగా ప్రయాణించి హోటల్ వివాంటాకు చేరుకుంది. అంతలో సూర్య నమస్కార్ తిరహా నుండి ముఖ్యమంత్రి వాహన శ్రేణి ఓవర్‌బ్రిడ్జిని సమీపిస్తోంది. ఓవర్‌బ్రిడ్జి సమీపంలో విద్యుత్ స్తంభాల నుండి తీగల్లో అకస్మాత్తుగా పెద్ద పేలుడు సంభవించింది. ఒక్కసారిగా పొగ దట్టంగా వ్యాపించడం మొదలైంది. ఈ ఘటనతో సీఎం యోగి భద్రతపై పలు ప్రశ్నలను లేవనెత్తుతున్నారు. ఆ సన్నివేశాన్ని చూసిన స్థానికులు రోడ్డు పక్కన నిలబడి ఉన్నారు. ఈ ఘటన మొత్తాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ ఘటన గురించి అడగ్గా పైప్‌లైన్‌లను పరిశీలించిన తర్వాత పేలుడుకు సంభవించినట్టు సబ్-డివిజనల్ అధికారి ఒకరు వెల్లడించారు.

## మేడ్చల్ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం..

### గాల్లో పల్టీలు కొట్టిన కారు

మేడ్చల్ జాతీయ రహదారిపై ఐటీఐ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదం కలకలం రేపింది. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళు_న్న TS 36 E 123 నంబర్ గల కారు అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొని పల్టీలు కొట్టింది. ప్రమాద సమయంలో కారులోని ఎయిర్‌బ్యాగులు సకాలంలో తెరుచుకోవడంతో పెను ప్రమాదం తప్పినట్లు సమాచారం. అయినప్పటికీ కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. గాయపడిన వారు సిద్దిపేట జిల్లా ములుగు మండలం కోల్తూరు గ్రామానికి చెందిన సురేష్, శ్రీకాంత్‌లుగా గుర్తించారు. క్షతగాత్రుల ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంతో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిం చారు. వారం రోజుల క్రితమే ఇదే జాతీయ రహదారిపై రేకులభావి సమీపంలో జరిగిన కారు ప్రమాదం మరువకముందే మరో ఘటన చోటుచేసుకోవడంతో వాహనదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కాంగ్రెస్‌కు కొండా గుడ్‌బై?

### త్వరలో భారీ అప్‌డేట్ అంటూ పోస్ట్, వాస్తవం ఏమిటంటే?



తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి కొండా సురేఖ దారి ఎటు? గురువారం సాయంత్రం మీడియాతో చెప్పాల్సినవన్నీ చెప్పేశారు. ఆమె ప్రెస్ మీట్ చూసినవాళ్లు మాత్రం, పార్టీ మారడం ఖాయమనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు పలువురు రాజకీయ నేతలు. తాజాగా ఆమె ఎక్స్ వేదికగా చేసిన ట్వీట్ వెనుక అసలు కారణమేంటి? ఇవే ప్రశ్నలు చాలామందిని వెంటాడుతున్నాయి.

2లో

## 'నేను సీఎం కావాలనుకుంటున్నా

### నాపై హరీష్‌రావు భార్య పోటీ చేయాలి: కవిత



2లో

## రేవంత్ కేబినెట్‌లోకి మరో ఫైర్‌బ్రాండ్


### హైకమాండ్‌తో విజయశాంతి మంతనాలు, ఆ శాఖ కోసం పట్టు



తెలంగాణలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. పార్టీలో లుకలుకలకు ఫుల్‌స్టాప్ పడడంతో కేబినెట్ పునర్వ్యవస్థీకరణ రంగం సిద్ధమైంది. కొండా సురేఖ స్థానంలో అలాంటి ఫైర్ బ్రాండ్ నేతను తీసుకోవాలని రేవంత్ సర్కార్ భావిస్తోంది. ఈ క్రమంలో పార్టీ ఎమ్మెల్సీ విజయశాంతి పేరు వెలుగులోకి వచ్చింది. దీంతో ఆమె ఢిల్లీకి బయలు దేరినట్టు సమాచారం. తెలంగాణలో రేవంత్ కేబినెట్ విస్తరణకు రంగం సిద్ధమైంది. ఈసారి మంత్రివర్గంలో భారీగా మార్పులు జరగనున్నాయి. అందుకు పార్టీ హైకమాండ్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

2లో

# సూపర్ ఎల్‌నినో వచ్చేస్తోంది



రానున్న మూడు. నెలలు భగభగలు.. హెచ్చరికలు జారీ...

ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపే ఎల్‌నినో మరింత బలపడుతోంది. ఉష్ణమండల పసిఫిక్ ప్రాంతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడంతో.. ఈ ఏడాది చివరి నాటికి ఎల్‌నినో అత్యంత శక్తివంతమైన స్థాయికి చేరుకునే అవకాశం ఉందని ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరించింది. ఈ ప్రభావం 2027 ఫిబ్రవరి వరకు కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. ఆధునిక వాతావరణ పర్యవేక్షణ ప్రారంభమైన తర్వాత నమోదయ్యే అత్యంత బలమైన ఎల్‌నినోలలో ఇది ఒకటిగా మారే అవకాశం ఉందని డబ్ల్యూఎంఓ పేర్కొంది. సముద్ర ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కొద్దీ ఎల్‌నినో బలపడుతోందని, దీని ప్రభావంతో ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు అస్థిరంగా మారే అవకాశముందని తెలిపింది. ఎల్‌నినో ప్రభావం అన్ని దేశాల్లో ఒకే విధంగా ఉండదు. అయితే భారత్‌లో మాత్రం నైరుతి రుతుపవనాలపై ప్రభావం చూపి వర్షపాతం తగ్గే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది.

2లో



## మెడకాయ మీద తలకాయ ఉన్నోడు ఇంటర్ విద్య తీసేయాలని అనడు.

4లో

# నడిరోడ్డుపై ఆర్టీసీ బస్సు బోల్తా

### కల్వర్టును ఢీకొట్టి బస్సు బోల్తా
### అక్కడికక్కడే డ్రైవర్ మృతి
### ఆసుపత్రికి తరలించిన క్షతగాత్రులు



కామారెడ్డి జిల్లా పరిధిలోని జాతీయ రహదారిపై తెల్లవారుజామున తీవ్ర దిగ్భ్రాంతికరమైన రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి బిచ్కుంద వైపు వెళ్తున్న తెలంగాణ ఆర్టీసీ బస్సు జుక్కల్ మండలం వద్ద వేగంగా వెళ్తూ అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న కల్వర్టు గోడను బలంగా ఢీకొట్టి బోల్తా పడింది. నిద్రమత్తు లేదా సాంకేతిక లోపం కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. తీవ్ర వేగంతో ఢీకొట్టడంతో బస్సు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యి తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రమాద సమయానికి బస్సులో 13 మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నట్లు అధికారులు ప్రాథమికంగా ధృవీకరించారు. ఈ తీవ్ర ప్రమాదంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, బస్సులోని పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు.

2లో

సంపాదకీయం

# ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లు - ప్రభుత్వ దుష్ప్రచారం?

రాష్ట్ర ప్రభుత్వ ఆదాయంలో 99 శాతం ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లకే ఖర్చు చేయాల్సి వస్తుందనే దుష్ప్రచారాన్ని మంత్రుల నుండి ముఖ్యమంత్రి వరకు ఒక పథకం ప్రకారం సాగిస్తున్నారు. ఉద్యోగుల వేతన సవరణ ఎగ్గొట్టటానికే ఈ కుట్రపూరిత ప్రచారానికి వొడిగట్టారు. ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లకే ఈ విష ప్రచారం పరిమితం కాదు. ప్రజల సంక్షేమ పథకాలు, రైతుల వ్యవసాయానికిచ్చే ఉచిత విద్యుత్ వంటి వాటికి కూడా ఈ విమర్శలను ముడిపెడుతున్నారు. వీటి వల్ల అభివృద్ధికి నిధులు లేకుండా పోతున్నాయనే వాదన చేస్తున్నారు. ప్రభుత్వం చేస్తున్న ప్రచారంలో వాస్తవం ఎంతో పరిశీలిద్దాం. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధానంగా మూడు విధాలుగా ఆదాయం సమకూరుతుంది. మొదటిది రాష్ట్ర ప్రభుత్వ సొంత పన్నులు, పన్నేతర ఆదాయం ద్వారా, రెండోది కేంద్ర ప్రభుత్వ పన్నుల్లో రాష్ట్ర వాటాతో పాటు కేంద్ర ప్రభుత్వ గ్రాంట్ల ద్వారా వచ్చే ఆదాయం. మూడోది అప్పుల ద్వారా సమకూర్చుకునే ఆదాయం. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొదటి రెండు విధాలుగా సమకూరిన ఆదాయం రూ.2.03 లక్షల కోట్లు. ఇవిగాక అప్పుల ద్వారా అదనంగా మరో రూ.77392 కోట్లు సమకూర్చుకుంది. కిందటి ఏడాదిలో చేసిన మొత్తం బడ్జెట్ వ్యయం రూ.2.53 లక్షల కోట్లు కాగా ఇందులో రెవెన్యూ వ్యయ పద్దు కింద రూ.2.36 లక్షల కోట్లు ఖర్చు చేశారు. ఇందులో అన్ని తరగతుల ఉద్యోగుల (శాశ్వత, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, స్కీమ్, ఇతర వేతన ఉద్యోగులు కలిపి) వేతనాలకు 26.04 శాతం, రిటైర్ అయిన వారి పెన్షన్లకు 37.36 శాతం చెల్లించారు. రెండింటికి కలిపి 37.40 శాతం ఖర్చు చేశారు. రాష్ట్ర విభజన తరువాత 2015-16 లో చూస్తే మొత్తం రెవెన్యూ వ్యయంలో వేతనాలకు 28.6 శాతం, పెన్షన్లకు 11.7 శాతం రెండింటికి కలిపి 40.3 శాతం చెల్లించారు. పదేళ్ల కాలంలో రాష్ట్ర రెవెన్యూ వ్యయంలో వేతనాలు, పెన్షన్లకు చేసిన చెల్లింపులు 40.3 నుండి 37.40 శాతానికి తగ్గిపోయింది. ప్రభుత్వం ప్రస్ఫుటంగా చేస్తున్న మరో వాదన ఏమిటంటే రాష్ట్రానికి వచ్చే సొంత పన్ను, పన్నేతర ఆదాయంలో 99 శాతం వేతనాలు, పెన్షన్లకు ఖర్చవుతుందనేది. 2015-16లో రాష్ట్ర ప్రభుత్వ సొంత ఆదాయం (రాష్ట్ర జీఎస్టీ, సేల్స్ టాక్స్, స్టాంప్స్-రిజిస్ట్రేషన్ ఫీజు, ఎక్సైజ్ డ్యూటీ, వాహన పన్ను, మైనింగ్ రాయల్టీ వంటి వాటి ద్వారా)లో వేతనాలకు 61.3 శాతం, పెన్షన్లకు 25. 1 శాతం చొప్పున మొత్తం 86.4 శాతం చెల్లించారు. 2025- 26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వానికి సొంత పన్నులు, పన్నేతర ఆదాయం మొత్తం రూ. 1,17,167 కోట్లు రాగా ఇందులో వేతనాలకు 50.14 శాతం, పెన్షన్లకు 21.99 శాతం, మొత్తం రెండింటికి కలిపి 72.13 శాతం చెల్లించారు. వాస్తవంగా గడిచిన పదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వ సొంత ఆదాయంలో కూడా ఉద్యోగుల వేతనాలు, పెన్షన్ల వాటా 86.4 శాతం నుండి 72.1 శాతానికి అంటే నికరంగా 14.3 శాతం తగ్గిపోయింది. ప్రభుత్వం ఈ కఠోర వాస్తవాలను ఉద్దేశపూర్వకంగా కప్పిపుచ్చి తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నది. ప్రజల్లో వ్యతిరేకత సృష్టిస్తున్నది. ఉద్యోగులు, పెన్షనర్లకు వ్యతిరేకంగా ఉసిగొల్పుతున్నది. వాస్తవంగా రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో, పరిశ్రమల్లో పని చేసే ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు, ప్రజలే మూల కారణం. ఉదాహరణకు రాష్ట్ర ప్రభుత్వానికి 2025 -26లో జీఎస్టీ ద్వారా రూ.49498 కోట్లు, స్టాంప్స్-రిజిస్ట్రేషన్ ఫీజుల ద్వారా రూ.11046 కోట్లు, సేల్స్ టాక్స్ ద్వారా రూ.17811 కోట్లు, ఎక్సైజ్ డ్యూటీ (లిక్కర్ పై) ద్వారా రూ.18251 కోట్లు వచ్చింది. ఈ పన్నులు అత్యధిక భాగం ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు, ప్రజలు వారికి వచ్చే ఆదాయాలను ఖర్చు చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఆయా పన్నుల ద్వారా ఆదాయం సమకూరుతున్నది. రాష్ట్ర ప్రభుత్వానికే కాదు కేంద్ర ప్రభుత్వానికి కూడా జీఎస్టీ, ఇన్‌కమ్ టాక్స్, ఎక్సైజ్ డ్యూటీ వంటి వాటి ద్వారా వచ్చే ఆదాయానికి వీరే ప్రధాన కారణం. కానీ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా రాష్ట్రాలకు ఇవ్వాల్సిన కేంద్ర పన్నుల్లో వాటాను ఇవ్వకుండా దిగకోస్తున్నా టిడిపి కూటమి ప్రభుత్వం నోరు మెదపకుండా రాష్ట్రానికి రావాల్సిన ఆదాయ వనరులను దెబ్బతీస్తున్నది. కేంద్ర 14వ ఆర్థిక సంఘం కేంద్ర పన్నుల ఆదాయంలో రాష్ట్రాలకు 42 శాతం బదిలీ చేయాలని (జమ్ము కాశ్మీర్‌ను విభజించిన తరువాత 41శాతానికి తగ్గించారు) సిఫారసు చేసింది. దీని ప్రకారం మన రాష్ట్రానికి కేంద్ర పన్నుల ఆదాయాన్ని మోడీ ప్రభుత్వం బదిలీ చేయడంలేదు. గత పదేళ్లుగా 30 శాతానికి మించి ఇవ్వడం లేదు. మరొకటి కేంద్రం ప్రభుత్వం సంక్షేమ పథకాలు, స్థానిక సంస్థలకు బదిలీ చేయాల్సిన ఆర్థిక సంఘం నిధులు, అభివృద్ధి గ్రాంట్లకు కూడా భారీ కోత పెడుతున్నది. 2021-22లో రూ.39170 కోట్లు ఈ పద్దుల కింద రాగా 2025-26కి రూ.20,322 కోట్లుకు కోత పెట్టింది. అయినా టిడిపి ప్రభుత్వం కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని నిలేయడం లేదు సరికదా పైగా కేంద్రంతో రాష్ట్ర కూటమి జత కట్టడం వల్ల రాష్ట్రానికి భారీగా నిధులొస్తున్నాయనే మాయా ప్రచారాన్ని సాగిస్తున్నది. రాష్ట్ర ఆర్థిక దుస్థితికి ఉద్యోగులు, పెన్షన్‌దారులను ప్రధాన కారకాలుగా బోనులో నిలబెడుతున్నది. రాష్ట్ర కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక, పారిశ్రామిక విధానాలు రాష్ట్ర ప్రభుత్వ పన్ను, పన్నేతర ఆదాయ రాబడిని దారుణంగా దెబ్బతీస్తున్నది. ఉదాహరణకు విశాఖపట్నం దగ్గరలో నక్కపల్లి దగ్గర ఏర్పాటు చేయబోతున్న ఆర్సిలాల్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న పన్ను రాయితీలు, సబ్సిడీలు వల్ల రాష్ట్ర ఖజానా రూ 28 వేల కోట్లు నష్టపోతున్నది. ఈ పరిశ్రమకు అవసరమైన నీటి సరఫరాకు ఏకంగా రూ.660 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఆసియా అభివృద్ధి బ్యాంకు నుండి అప్పు తీసుకొని 50 కిలో మీటర్ల పొడవునా పైపులైన్ కూడా వేస్తున్నది. విశాఖ చుట్టూ గూగుల్, అదానీ, రిలయన్స్ వంటి సంస్థలు ఏర్పాటు చేయబోతున్న 6.5 గిగావాట్ల (6500 మెగావాట్ల) సామర్థ్యం కలిగిన డేటా సెంటర్లకు సుమారు రూ.లక్షా 43 వేల కోట్ల పన్ను రాయితీలు, సబ్సిడీలు ఇస్తున్నది. ఇంత పెద్ద మొత్తంలో రాష్ట్ర ఖజానా నష్టపోతున్నది. ఇటీవల ప్రారంభించిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ఆదాయం నుండి రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని, పన్నులను చంద్రబాబు ప్రభుత్వం పదేళ్ల పాటు చెల్లించనవసరం లేదని ఒప్పందం చేసుకుంది. రాష్ట్రంలో పరిశ్రమలు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, స్టార్ హోటళ్లు, షాపింగ్ మాళ్లు... ఇలా ఏది ఏర్పాటు చేసినా 10 నుండి 15 ఏళ్ళు పాటు పన్నులు పూర్తిగా మినహాయించేశారు. అనేక సబ్సిడీలు ఇచ్చేస్తున్నారు. పైగా ఇపుడు పెట్టుబడులు పెట్టే వారికి రాష్ట్ర ప్రభుత్వం సొంత నిధులతో వారికి మౌలిక సదుపాయాలు కల్పించటమే కాక పెట్టుబడి వయబులిటీ గ్యాప్ పేర పెట్టే పెట్టుబడిలో 20 శాతం ఎదురు డబ్బు రాష్ట్ర ఖజానా నుండి ఇస్తుందని జీవోలు విడుదల చేశారు. ఒక్క డేటా సెంటర్లకే రాష్ట్ర ఖజానా నుండి సుమారు రూ.30 వేల కోట్లు చెల్లించటానికి ఒప్పందం చేశారు. ఒకవైపు పన్నుల మినహాయింపు, సబ్సిడీల వల్ల రాష్ట్ర ఖజానా రూ.వేల కోట్లు నష్టపోతుండగా... రెండో వైపు ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు, ప్రజలు చెల్లించే పన్నుల ఆదాయాన్ని కూడా అప్పనంగా పెట్టుబడిదారులకు దోచి పెడుతూ... ఉద్యోగులు, పెన్షనర్ల పిఆర్‌సి పై దాడి చేస్తున్నది. రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (ఎస్ జిడిపి) పెరిగినా రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం, పన్నేతర ఆదాయం పెరగటం లేదు. దీనికి ప్రధాన కారణం పెట్టుబడిదారులకు, పారిశ్రామిక అధిపతులకు ఇస్తున్న భారీ పన్నుల రాయితీలు, సబ్సిడీలే. దీనివల్ల గత పదేళ్లలో రాష్ట్ర జిడిపి లో రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం బాగా తగ్గిపోయింది. రెండో పక్క రాష్ట్రంలో ఉన్న ఖనిజ సంపదను విచ్చలవిడిగా కార్పొరేట్ దోపిడీకి అనుమతించడంతో పన్నేతర ఆదాయం కూడా రూ.వేల కోట్లు నష్టపోతున్నది.

# ‘నేను సీఎం కావాలనుకుంటున్నా

## నాపై హరీష్‌రావు భార్య పోటీ చేయాలి’: కవిత




తాను తెలంగాణ సీఎం కావాలనుకుంటున్నానని కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. తనపై పోటీ చేసేందుకు హరీశ్‌రావు భార్య ముందుకు రావాలని సవాల్ విసిరారు. తనపై ఎవరు పోటీ చేసినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై తీవ్ర విమర్శలు చేసిన ఆమె.. ఇంటర్మీడియట్ విద్యను రద్దు చేసే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఆకునూరి మురళి కమిషన్, విద్యా విధానాలు, రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులపైనా కవిత కీలక వ్యాఖ్యలు చేశారు.

కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో మరోసారి హాట్ టాపిక్‌గా మారాయి. తన రాజకీయ భవిష్యత్‌పై కీలక వ్యాఖ్యలు చేసిన కవిత.. తాను తెలంగాణ ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నానని బహిరంగంగా వెల్లడించారు. అంతేకాదు.. తన రాజకీయ ప్రత్యర్థులకు సవాల్ విసురుతూ.. హరీశ్‌రావు భార్య తనపై పోటీ చేస్తే స్వాగతిస్తానని పేర్కొన్నారు. కవిత చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీశాయి. హైదరాబాద్‌లో తెలంగాణ ఇంటర్ విద్య జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘సేవ్ ఇంటర్ ఎడ్యుకేషన్’ సదస్సులో పాల్గొన్న కవిత.. ఈ వ్యాఖ్యలకు తెరలేపారు. ఈ సందర్భంగా ఆమె తన రాజకీయ లక్ష్యాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. తాను సీఎం కావాలనుకుంటున్నా అని స్పష్టం చేసిన కవిత.. ముఖ్యమంత్రి పదవి కేవలం అధికారానికి సంబంధించినది కాదని, ఆ పదవికి గౌరవం, హుందాతనం కూడా ఉండాలని వ్యాఖ్యానించారు.

తన రాజకీయ ప్రత్యర్థులపై స్పందించిన కవిత.. హరీశ్‌రావు భార్య తనపై పోటీ చేస్తే స్వాగతిస్తానని సవాల్ చేశారు. గతంలో తాను హరీశ్‌రావుపై పోటీ చేస్తానని చెప్పిన విషయం వాస్తవమేనని గుర్తుచేశారు. ఇప్పుడు ఆయన భార్య తనపై పోటీ చేస్తే కూడా తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. తనపై ఎవరు పోటీ చేసినా ఎదుర్కొనేందుకు రెడీగా ఉన్నానని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనపైనా కవిత తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వ నిర్ణయాలు, ముఖ్యమంత్రి ప్రకటనల మధ్య పొంతన కనిపించడం లేదని ఆరోపించారు. ఇకపై రేవంత్‌రెడ్డి చర్యలను తుగ్లక్ చర్యలు అని చెప్పాల్సిన అవసరం లేదని.. రేవంత్ రెడ్డిలా ఉన్నావ్ అంటే సరిపోతుందని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. సీఎం పదవికి ఉండాల్సిన గౌరవాన్ని, హుందాతనాన్ని కాపాడాలని సూచించారు. తెలంగాణలో ఇంటర్మీడియట్ విద్యను ఎత్తివేసే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని కవిత డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యను రద్దు చేయబోమని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంగా ప్రకటించాలని కోరారు. ఇంటర్మీడియట్ విద్యను రద్దు చేస్తే ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు, బాలికలు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటర్ విద్య తెలంగాణలో బలమైన వ్యవస్థగా ఉందని, దానిని మార్చాల్సిన అవసరం లేదని అన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో పెట్టుకోవడం అంటే ప్రభుత్వానికి తీవ్ర ఇబ్బందులు తెచ్చుకోవడమేనని హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన అంశంలో ప్రభుత్వం జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. విద్యా రంగానికి సంబంధించి గతంలో ఏర్పాటు చేసిన రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి నేతృత్వంలోని కమిషన్‌పైనా కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు చేశారు. ఆ కమిషన్‌కు 3 సంవత్సరాల సమయం కేటాయించి చివరకు దాని సిఫార్సులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు.

ఇంటర్‌లో పాస్ శాతం 45 శాతానికి పెంచాలన్న సిఫార్సుపై కూడా ఆమె ప్రశ్నలు లేవనెత్తారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఓట్ల శాతాన్ని ప్రస్తావిస్తూ కవిత వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రస్తుతం మళ్లీ మరో కమిషన్ గురించి ప్రభుత్వం మాట్లాడుతోందని.. దాని నివేదిక ఎప్పుడు వస్తుంది, ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు.

# సూపర్ ఎల్‌నినో వచ్చేస్తోంది

చారిత్రకంగా ఎల్‌నినో బలహీన రుతుపవనాలతో సంబంధం కలిగి ఉన్నప్పటికీ.. ప్రతిసారీ ఇదే పరిస్థితి ఉంటుందని చెప్పలేమని వాతావరణ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే రుతుపవనాల వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉంటుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. మే నెలలో విడుదల చేసిన సవరించిన అంచనాల ప్రకారం.. సీజన్ వర్షపాతం దీర్ఘకాలిక సగటులో 90శాతం మాత్రమే ఉండొచ్చని తెలిపింది. ఆగస్టు నెలలోనూ దేశవ్యాప్తంగా వర్షపాతం సుమారు 16 శాతం లోటుగా నమోదైంది. సెప్టెంబర్ నుంచి నవంబర్ మధ్య కాలంలో ప్రపంచంలోని దాదాపు అన్ని భూభాగాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని డబ్ల్యూఎంఓ తాజా అంచనా చెబుతోంది. అదే సమయంలో ప్రాంతాలను బట్టి వర్షపాతంలో భారీ వ్యత్యాసాలు ఉండొచ్చని హెచ్చరించింది. డబ్ల్యూఎంఓ సెక్రటరీ జనరల్ సెలెస్టే సాలో ప్రకారం.. స్పానిష్ బాషలో ఎల్‌నినో అంటే చిన్న బాలుడని అర్థం. కానీ, వివిధ దేశాల ఆర్థిక వ్యవస్థలను ధ్వంసం చేయగల సత్తా ఉంది. ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా కరవు కాటకాలు, కార్చిచ్చులు, వరదలు నమోదవుతున్నాయి. ఎల్‌నినో తీవ్రతతో పాటు ఇవి కూడా మరింత ప్రమాదకరంగా మారనున్నాయి. ఈ అసాధారణ ఎల్ నినో పరిస్థితులను అంతే స్థాయిలో సమర్థంగా ఎదుర్కొనేందుకు సిద్ధమవ్వాలి. డబ్ల్యూఎంఓ యాభై ఏళ్ల చరిత్రలో ఎన్నడూలేనంత స్థాయిలో జాతీయ వాతావరణ సంస్థలు, జలవనరుల సేవలను అప్రమత్తం చేస్తున్నాం. మానవ ప్రాణ, జీవనోపాధి మార్గాలకు విఘాతం కలగకుండా ఎప్పటికప్పుడు సమాచారం అందించేది వీరే. ఐక్యరాజ్య సమితికి చెందిన అన్ని మానవీయ సేవల సంస్థలతో సమాచారం, విపత్తుల నిర్వహణలో సాయం, వ్యవసాయం, ఆరోగ్యం, జలవనరుల నిర్వహణలో సాయం అందిస్తామని అన్నారు.

# సొంత పార్టీని ముంచేస్తున్న నేతల దూకుడు

కాంగ్రెస్ పార్టీ అనేది సముద్రం లాంటింది. అందులోకి వచ్చినవారు వస్తుంటారు.. వెళ్లిపోయినవారు పోతుంటారు. అక్కడ నేతలకు విపరీతమైన స్వేచ్ఛ ఉంటుంది. ఎప్పుడు, ఏదైనా, ఎవరి మీదైనా మాట్లాడవచ్చు. తమకు ఎదురులేదని భావిస్తుంటారు. ఒక్కమాటలో చెప్పాలంటే నేతల కాస్త నోటి దూకుడు ఎక్కువ. నాలుగు పదునైన మాటలు మాట్లాడడం వల్ల వారి కెరీర్ డ్యామేజ్ అవుతున్న సందర్భాలు ఇటీవల రాజకీయాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. 2014 ముందు వరకు ఓ తరహా రాజకీయాలు ఉండేవి. ఆ తర్వాత రాజకీయాలు పూర్తిగా మారిపోయాయి. జాతీయ పార్టీల అగ్రనేతలు సైతం తమ నేతలను నోరు అదుపులో పెట్టుకోవాలని పదే పదే హెచ్చరిస్తుంటారు. ఒక్కమాటలో చెప్పాలంటే సొంత పార్టీ నేతలే కాంగ్రెస్ పార్టీని ముంచేస్తున్నారు. ఏ పార్టీలో లేని ఈ రచ్చ, కేవలం కాంగ్రెస్ పార్టీలో ఎందుకు జరుగుతోంది? ఇవే ప్రశ్నలు చాలామందిని వెంటాడు తున్నాయి.

కొండాసురేఖ-చెన్నారెడ్డి ఎపిసోడ్‌తో నేతలకు వణుకు

తెలంగాణలోని అధికార కాంగ్రెస్ పార్టీలో దాదాపు 10 రోజులుగా కొండా సురేఖ-చిన్నారెడ్డి వ్యవహారం తీవ్రచర్చకు దారితీసింది. దీనిపై మీడియాలో చర్చల మీద చర్చలు. ఒక విధంగా చెప్పాలంటే ప్రత్యర్థుల కంటే సొంత పార్టీ నేతలు కాంగ్రెస్ పార్టీని డ్యామేజ్ చేసే పరిస్థితికి వచ్చారు. ఇన్నాళ్లు మాదిరిగా ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో లేదు. పరిస్థితులు మారాయి.. నేతలు మారారు. లోపాలను సరిదిద్దుకుంటూ పార్టీని బలోపేతం చేసేందుకు నిత్యం అడుగులు వేస్తున్నారు. గురువారం కొండా సురేఖను ప్రభుత్వం మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయడం, చిన్నారెడ్డిపై వేటు వేయడం చకచకా జరిగిపోయింది.

బీసీ కార్డు బయటకు తీస్తారేమోనని భావించిన ప్రభుత్వం, వెంటనే ముగ్గురు బీసీ మహిళలకు పదవులు ఇచ్చారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ నిర్ణయాలు ఆలస్యంగా ఉంటాయని భావించారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి చకచకా పరిమాణాలు మారిపోయాయి. ఆ వేగాన్ని చూసి పలువురు సీనియర్లు సైతం షాకయ్యారు.

రేసులో అరడజను మంది నేతలు, నెక్ట్స్ వికెట్ ఎవరిది?

కొండా సురేఖ-చిన్నారెడ్డి వికెట్లు డౌన్ కావడంతో మిగతా నేతలకు చిన్నపాటి వణుకు మొదలైంది. గతంలో మీడియా ముందు తాము చేసిన మాటలు ఏ రూపంలో వెంటాడుతాయోనని భయపడుతున్నారు. ఈ తరహా నేతలు కాంగ్రెస్ పార్టీలో దాదాపు డజను మంది సీనియర్ నేతలు ఉండవచ్చని ఓ అంచనా. కొండా-చెన్నారెడ్డిలపై వేటు పడడంతో మిగతా-సీనియర్ నేతలకు వణుకు మొదలైనట్టు గాంధీభవన్ వర్గాల మాట. ఈ ఎపిసోడ్‌తో ఆయా నేతలు చల్లబడ్డారా? ఎన్నికలకు ఇంకా రెండేళ్లు ఉందని చెప్పి దూకుడు కంటిన్యూ చేస్తారా? అన్నది అసలు ప్రశ్న. దూకుడుగా మాట్లాడే నేతలు జాబితా రెడీ అయ్యిందని, ఇంకా శృతిమించితే వేటు పడడం ఖాయమని గాంధీభవన్ వద్ద గుసగుసలు. జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే.. రానున్న రోజుల్లో దూకుడు నేతల నోటికి కళ్లెం పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# రేవంత్ కేబినెట్‌లోకి మరో ఫైర్‌బ్రాండ్

ఈసారి కేబినెట్‌లోకి ఎవర్ని తీసుకుంటారనేది ఆసక్తిగా మారింది. కొండా సురేఖను కేబినెట్ నుంచి బర్తరఫ్ తర్వాత కొత్త కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. సురేఖ స్థానంలో మహిళకు మంత్రి అవకాశం ఇవ్వాలని హైకమాండ్ స్పష్టంచేసినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో ఎమ్మెల్సీ విజయశాంతి పేరు వెలుగులోకి వచ్చింది. ఆమె పేరు దాదాపు ఖాయమైనట్టు గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. ఎన్నికల తర్వాత ఆమెకి ఎమ్మెల్సీ పదవి ఇచ్చింది పార్టీ. అప్పుడప్పుడు సమయం, సందర్భం బట్టి మీడియా ముందుకు వచ్చిన సందర్భాలు ఉన్నాయి. అలాగని పార్టీపై ఏనాడూ నోరు విప్పిన దాఖలాలు లేవు. ఆమెకి పదవి ఇస్తే బాగుంటుందని రాష్ట్ర నాయకత్వానికి సూచిస్తున్నట్లు టాక్. కొండా సురేఖకు విజయశాంతి అతికినట్టుగా సరిపోతుందని అంటున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్‌ను ఇరుకున పెట్టాలంటే రాములమ్మకు తెలిసినట్టుగా మరెవరికీ తెలీదని అంటున్నారు. ఎందుకంటే గతంలో కేసీఆర్ పార్టీలో ఎంపీ గెలిచారు విజయశాంతి. ఆ పార్టీ గురించి ఎ టు జెడ్ ఆమెకి తెలిసినట్టు మరెవరికీ తెలీదని అంటున్నారు. ఆమెకి మంత్రి పదవి ఇస్తే.. ప్రత్యర్థులను ఎదుర్కోవడం తోపాటు పార్టీ వాయిస్ ప్రజల్లోకి బలంగా వెళుతుందని అధిష్టానం లెక్కలు వేస్తోందట. కేబినెట్‌లోకి విప్ ఆది శ్రీనివాస్‌కు అవకాశం ఇవ్వాలన్నది ఆలోచనగా కనిపిస్తోంది. ఇద్దరు లేదా ముగ్గుర్ని కేబినెట్‌లోకి తీసుకుని, పలువురు సీనియర్లకు శాఖలు మార్పు చేయాలన్నది భావిస్తోంది రేవంత్ ప్రభుత్వం.

హోంశాఖ కోసం రాములమ్మ ప్రయత్నాలు?

ఈ విషయం తెలియగానే విజయశాంతి ఢిల్లీ వెళ్లేందుకు రెడీ అయినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గతంలోనే ఆమె పేరు వెలుగులోకి వచ్చింది. కాకపోతే కొన్ని కారణాల వల్ల వెనక్కి వెళ్లింది. ఈసారి విజయశాంతికు కేబినెట్ లో చోటు దక్కడం ఖాయమని అంటున్నాయి. హోం శాఖ కావాలని విజయశాంతి పట్టుబడుతున్నట్లు సమాచారం.

# కాంగ్రెస్‌కు కొండా గుడ్‌బై?

## త్వరలో భారీ అప్‌డేట్ అంటూ పోస్ట్, వాస్తవం ఏమిటంటే?

మాజీ మంత్రి కొండా సురేఖ ఆసక్తికర పోస్టు

మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ తర్వాత మీడియా ముందుకొచ్చారు మాజీ మంత్రి కొండా సురేఖ. చెప్పాల్సిన వన్నీ చెప్పేశారు.. కాంగ్రెస్ పార్టీ కంటే, ఎక్కువగా ముఖ్యమంత్రిని టార్గెట్ చేస్తూ మాట్లాడారు. ఆయనకు టీడీపీ వాసన పోలేదంటూ ప్రస్తావించారు. కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీలో ఉండరని చాలామంది నేతలు భావించారు. ఈ క్రమంలో ఆమె మా వైపు వద్దంటూ బీఆర్ఎస్ మద్దతుదారులు పోస్టు పెట్టారు. ఆమెకు మంత్రి పదవి ఇవ్వలేదన్న కారణంగా కారు పార్టీ నుంచి బయటకు వచ్చేశారని రాసుకొచ్చారు. మీడియా సమావేశం జరుగుతుండగా సురేఖ పక్కన ఆమె భర్త లేరు. మేడ మీద మీసాలు తిప్పుతూ కనిపించారు. అప్పుడే కొండా దంపతులు పార్టీ నుంచి మారడం ఖాయమని డిసైడ్ అయ్యారు.

త్వరలో భారీ అప్‌డేట్, ‘స్టే ట్యూన్డ్ తెలంగాణ అంటూ ప్రస్తావన

అయితే, శుక్రవారం మాజీ మంత్రి కొండా సురేఖ పేరుతో ఉన్న ఫేస్ బుక్‌లో ఓ పోస్టు ప్రత్యక్షమైంది. ‘ది వెయిట్ ఈజ్ ఆల్మోస్ట్ ఓవర్’ అని అందులో ఉంది. అంతేకాదు ‘బిగ్ అప్‌డేట్ ఈజ్ కమింగ్ సూన్’ అంటూ హింట్ ఇచ్చారు. ‘స్టే ట్యూన్డ్ తెలంగాణ’ అంటూ ఆసక్తి పెంచారు. కేబినెట్ నుంచి బర్తరఫ్ తర్వాత కొండా సురేఖ గురించి చర్చ నడుస్తున్న నేపథ్యంలో ఈ పోస్ట్ మరింత ఆసక్తి రేపింది. కాంగ్రెస్‌లో కొనసాగుతారా? కీలక నిర్ణయం తీసుకుంటారా? తన రాజకీయ భవిష్యత్‌పై ఏదైనా ప్రకటన చేయబోతున్నారా? ఇదే ప్రశ్నలు చాలామందిని వెంటాడుతున్నాయి. భర్త కొండా మురళితో కలిసి తదుపరి కార్యాచరణపై ప్రకటన ఉంటుందా? అనే ప్రశ్నలు వెలువడ్డాయి. అయితే, కొండ సురేఖ టీమ్.. ఈ విషయాన్ని కొట్టి పడేసింది. అది ఫేక్ అకౌంట్ అని. ఆ పోస్టుతో తమకు సంబంధం లేదని స్పష్టం చేశారు.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....
ప్రజాగళం
తెలుగు దినపత్రిక
శనివారం
05 -09-2026

## వినాయకచవితి నవరాత్రులకు మాజీ ఎమ్మెల్యే షకీల్ ని ఆహ్వానించిన ఉత్సవ కమిటీ.



బోధన్ ప్రతినిధి,సెప్టెంబర్ 4: (ప్రజా గళం) ఈ నెల 14వ తేదీన వినాయకచవితి నవరాత్రులు ప్రారంభం అవుతున్న సందర్భంగా శ్రీ చక్రేశ్వర శివాల యంలో జరిగే వినాయక చవితి ఉత్సవాలకు హాజరు కావాలని ఉత్సవ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే మోహ్మద్ షకీల్ అమెర్ ని ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం అయన నివాసంలో షకీల్ ను కలిసి ఆహ్వానం పలికారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే షకీల్ ను శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పూజారి లింగం, కౌన్సిలర్ అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

## బోధన్ లోని శ్రీ రాధాకృష్ణ మందిరంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు.



బోధన్ ప్రతినిధి,సెప్టెంబర్ 4: (ప్రజా గళం) శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని బోధ న్ గంజ్‌రోడ్ లోని శ్రీ రాధాకృష్ణ మందిరంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం,అర్చనలు తది తర ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తి శ్రద్ధలతో వేడుక లు జరిపారు. ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజ రై శ్రీకృష్ణుడిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నా రు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశా రు.

## జిల్లా పోలీస్ సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులకు సన్మానం




ఆర్మూర్ సెప్టెంబర్5 ( ప్రజాగళం) పట్టణంలోని పోలీస్ కార్యాలయంలో నూతనంగా జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షులుగా ఎన్నుకోబడిన ఎర్రపాటి శ్రీనివాస్. సీనియర్ రైటర్. మహమ్మద్ రహాఫత్ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ లను ఉత్తర తెలంగాణ మండల వైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ మహబూబ్ లను సన్మానించారు. శుక్రవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్లో శాలువాతో ఘనంగా సన్మానించారు. నూతనంగా ఎన్నుకోబడ్డ పోలీస్ శాఖ సభ్యుల అభివృద్ధికి పాటుపడాలన్నారు. వారి సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేయాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు సాధించాలని కోరారు కార్యక్రమంలో పట్టణ సీఐ సత్యనారాయణ గౌడ్. కానిస్టేబుల్ రాములు. పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలం!

### బిజెపి బోధన్ అసెంబ్లీ ఇంచార్జ్ వడ్డి మోహన్ రెడ్డి ధ్వజం. అలీసాగర్ రిజర్వాయర్ ను సందర్శించి నీటి నిల్వలను పరిశీలించిన బిజెపి



బోధన్ ప్రతినిధి,సెప్టెంబర్ 4: (ప్రజా గళం) నిజాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు తాగునీటికి, సాగునీటికి సరిపడా ఉన్నప్పటికీ,రైతులకు సాగునీరు అందించడంలో పాలకులు పూర్తిగా విఫలమ య్యారు అని బిజెపి బోధన్ అసెంబ్లీ ఇంచార్జ్ వడ్డి మో హన్ రెడ్డి ఆరోపించారు. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం ఠాణాకలాన్ గ్రామ శివారులోని అలీసాగర్ రిజర్వాయర్ చెరువును సందర్శించి నీటి నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో వడ్డి మోహన్ రెడ్డి మాట్లాడుతూ. అలీసాగర్ ప్రాజెక్టు ద్వారా 46,47, 49 వరకు మాత్రమే సాగునీరు అందిస్తున్నారు అని,మరి ఇటు నవీపేట్ మండలం రైతులు,అటు బోధన్ రూరల్ ప్రాంత రైతులు ఏం పాపం చేశారు?అని అయన ప్రశ్నించారు. సాగునీరు అందక రైతులు నోటికొచ్చిన పంటను నష్టపోతున్నారు అని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల కష్టాలను,ఆవేద నను ప్రభుత్వం వెంటనే గుర్తించి,న్యాయం చేయాలి అని డిమాండ్ చేశారు. రానున్న 48 గంటల్లో అలీసాగర్ ప్రాజెక్టు నుంచి కిందికి సాగునీరు విడుదల చేయకపోతే,అలీసాగర్ ప్రాజెక్టు పైనే టెంట్లు వేసుకుని రైతులతో కలిసి ధర్నాకు కూర్చుంటాం అని హెచ్చరించారు. రైతులకు సాగునీరు అందించే వరకు మా పోరాటం కొనసాగుతుంది అని బిజెపి బోధన్ నియోజకవర్గం ఇంచార్జి వడ్డి మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ నియోజకవర్గంలోని వివిధ మండలాల అధ్యక్షులు,సర్పంచులు,ప్రజా ప్రతినిధులు,బిజెపి కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలి.

### శాంతి కమిటీ సమావేశంలో ఆర్మూర్‌రూరల్ సిఐ జాన్‌రెడ్డి.



నందిపేట్ సెప్టెంబర్ 4( ప్రజా గళం ) గణేష్ పండుగ ఉత్సవాలను శాంతియుత వాతావరణం లో జరుపుకోవాలని ఆర్మూర్ రూరల్ సీఐ జాన్ రెడ్డి సూచించారు. వెల్మల్ , ఐలాపూర్ లలో గణేష్ చవితి పండుగను పురస్కరించుకొని ఆర్మూర్ రూరల్ సిఐ జాన్ రెడ్డి ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశాన్ని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఆదేశాల మేరకు గణేష్ ఉత్సవాల నిర్వహణ , భద్రతా ఏర్పాట్లు , శాంతిభద్రతలు , ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై గణేష్ ఉత్సవాల నిర్వాహకులతో మీటింగ్ నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా ఆర్మూర్ రూరల్ సిఐ జాన్ రెడ్డి మాట్లాడుతూ,గణేష్ ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతమైన , సోదరభావంతో కూడిన శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. పండుగ అనేది ప్రజలందరినీ ఐక్యం చేసే కార్యక్రమమని , ప్రతి ఒక్కరూ పరస్పరం సహకరించుకుంటూ మత సామరస్యాన్ని కాపాడాలని కోరారు. గణేష్ మండపాల నిర్వాహకులు ముందస్తుగా పోలీసుల అనుమతులు తీసుకోవడంతో పాటు , పోలీస్ శాఖ సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ తెలిపారు. మండపాల వద్ద భద్రతా ప్రమాణాలు పాటిస్తూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు , అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపాల వద్దకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ , పార్కింగ్ , జనసందోహం నియంత్రణకు నిర్వాహకులు ప్రత్యేకంగా సహకరించాలని తెలిపారు. మండపాల వద్ద డీజేలకు పర్మిషన్ లేదు అని, సౌండ్ సిస్టమ్‌ల వినియోగంలో ప్రభుత్వం నిర్దేశించిన శబ్ద పరిమితులు , సమయ నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. గణేష్ నిమజ్జన కార్యక్రమం సందర్భంగా కూడా నిర్వాహకులు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకొని ముందుగా నిర్ణయించిన మార్గాలు , సమయాలను పాటించాలని సూచించారు. నిమజ్జన ఊరేగింపులో పాల్గొనే వారు ఎలాంటి రెచ్చగొట్టే నినాదాలు , వివాదాస్పద చర్యలకు పాల్పడకుండా సంయమనం పాటించాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలు , వదంతులను నమ్మవద్దని , ఏదైనా అనుమానాస్పద సమాచారం లేదా సమస్య ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఉత్సవాల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని , గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా , సురక్షితంగా , విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని అవసరమైన భద్రతా చర్యలు చేపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా శాంతి కమిటీ సభ్యులు , గణేష్ మండపాల నిర్వాహకులు , ప్రజలు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించి మత సామరస్యాన్ని , శాంతిభద్రతలను కాపాడుతూ గణేష్ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో నందిపేట్ ఎస్సై వినయ్ , సిబ్బంది, ఆయా గ్రామాల ప్రజలు, శాంతి కమిటీ సభ్యులు, గణేష్ మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## అట్టర్ ఫ్లాప్ రేవంత్ రెడ్డి పాలన




ఆర్మూర్ సెప్టెంబర్5 ( ప్రజాగళం) ఆలూరు మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి పాలన నిరసిస్తూ వంట వార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. శుక్రవారం అంబేద్కర్ చౌరస్తా నుండి గ్రామ సచివాలయం మీదగా ఎమ్మార్వో కార్యాలయానికి భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి కాలినడకన నడుస్తూ రేవంత్ రెడ్డి పాలనపై పాంప్లెంట్లు పంచుతూ ఎండగట్టారు. ఎమ్మార్వో కార్యాలయం ముందురా బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలనుదేశించి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రజా వ్యతిరేక పాలన కొనసాగుతుందన్నారు. తెలంగాణలో తుగ్లక్ పాలన కొనసాగుతుందన్నారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో కళ్యాణ లక్ష్మికి తులం బంగారం ఏమైంది, దళితులకు దళిత బంధు ఏమైంది, విద్యార్థులకు స్కూటీలు ఎక్కడ అంటూ రేవంత్ రెడ్డి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కావాలంటున్నారన్నారు. రాబోయేది కేసీఆర్ పాలన అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ రాజన్న గారి విటల్, టిఆర్ఎస్ రాష్ట్ర,జిల్లా నాయకులు వివిధ మండలాల అధ్యక్షులు నాయకులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ దగా పాలనపై బీఆర్ఎస్ సమరభేరి.



### – 420 హామీలపై వెల్లువెత్తిన నిరసనలు.
### – మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త ఆధ్వర్యంలో వంట–వార్పు.

నిజామాబాద్, సెప్టెంబర్ 4(ప్రజాగళం ప్రతినిధి) కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు శుక్రవారం మూడవ రోజుకు చేరుకున్నాయి. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ లో శుక్రవారం వంట–వార్పు కార్యక్రమం, సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి మహిళలకు నెలకు 2,500 ఆర్థిక సాయం, కేసీఆర్ కిట్‌కు ప్రత్యామ్నాయంగా హామీలు, కళ్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం, మహిళలకు స్కూటీలు వంటి అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. 1000 రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? మహిళలకు ఇచ్చిన హామీలు ఎక్కడ? అంటూ ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. ప్రజా సమస్యలను, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మరిన్ని నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ మేయర్ దండు నీతూకిరణ్ శేఖర్,నగర అధ్యక్షులు, సిర్ప రాజు,మాజీ నుడా చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి,సుజిత్ సింగ్, సత్య ప్రకాష్, నవీద్ ఇక్బాల్ ,జగత్ రెడ్డి, ప్యాట సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....
ప్రజాగళం
తెలుగు దినపత్రిక
శనివారం
05 -09-2026

# సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి చొరవతో గుత్పా, అలీసాగర్ ఆయకట్టుకు సాగునీరు.

## మంత్రి ఉత్తమ్ తో ఫోన్ లో సంభాషించిన ఎమ్మెల్యేలు. - నీటి విడుదలకు అధికారులకు ఆదేశాలు.





నిజామాబాద్ సెప్టెంబర్ 4 ( ప్రజాగళం ప్రతినిధి) : నిజామాబాద్ జిల్లాలోని గుత్పా, అలీసాగర్ ఎత్తిపోతల పథకాల కింద ఉన్న ఆయకట్టు రైతులకు ఖరీఫ్ సీజన్‌లో సాగునీరు అందించేందుకు నీటి పారుదల శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి చొరవతో నిజాంసాగర్ నుంచి గుత్పా, అలీసాగర్ లిఫ్ట్‌లకు నీటిని విడుదల చేసేందుకు శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం నిజామాబాద్ జిల్లాలో ప్రధానంగా వరి పంట సాగవుతుండగా, పంటలు కీలకమైన పొట్టదశలో ఉన్న నేపథ్యంలో సాగునీటి అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్యే భూపతి రెడ్డి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. గుత్పా, అలీసాగర్ ఎత్తిపోతల పథకాల పరిధిలోని ఆయకట్టుకు నిజాంసాగర్ నుంచే నీటిని విడుదల చేసి, రైతులకు సకాలంలో సాగునీరు అందించాలని మంత్రిని కోరారు. అలీసాగర్, గుత్పా లిఫ్ట్‌లకు ప్రతి 10 రోజులకు ఒకసారి నీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం పంటలకు అత్యంత కీలకమైన దశ కావడంతో తక్షణమే నీటి విడుదల చేపట్టాలని వారు మంత్రిని కోరారు. వారి విజ్ఞప్తిపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెంటనే స్పందించి, సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే భూపతి రెడ్డి తెలిపారు. ఈ మేరకు అలీసాగర్ ఆయకట్టు పరిధిలోని సుమారు 48 వేల ఎకరాలకు, గుత్పా ఆయకట్టు పరిధిలోని సుమారు 35 వేల ఎకరాలకు కలిపి 83 వేల పైచిలుకు ఎకరాలకు ప్రయోజనం చేకూరేలా నీటిని విడుదల చేయనున్నారు. రోజుకు 1,500 క్యూసెక్కుల చొప్పున 10 రోజుల పాటు నీటిని విడుదల చేసేందుకు నీటిపారుదల శాఖ ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. దీంతో ఖరీఫ్‌లో సాగు చేస్తున్న వరి పంటకు అవసరమైన సమయంలో నీరు అందడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. రైతుల పంటలను కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని, సాగునీటి విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని భూపతి రెడ్డి తెలిపారు. గుత్పా, అలీసాగర్ ఆయకట్టు రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్పందించిన ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే భూపతి రెడ్డికి జిల్లా రైతులు కృతజ్ఞతలు తెలిపారు. సాగునీటి విడుదలకు అనుమతి లభించడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోందన్నారు.

# రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన బీఆర్ఎస్ కు నిరసనలు తెలిపే హక్కు లేదు.

## వెయ్యి రోజుల కాంగ్రెస్ ప్రజా పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట.
## ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి.



నిజామాబాద్ సెప్టెంబర్ 4 (ప్రజాగళం ప్రతినిధి) : పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి నిరసనలు తెలపడం విడ్డూరంగా ఉందని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి ఎద్దేవా చేశారు.
ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఆర్మూర్ నియోజకవర్గంలో సంబరాలు జరుపుకున్నారు. పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైన ఈ సంబరాలలో ఆయన మాట్లాడారు. ప్రజాపాలన ప్రభుత్వ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ నిరసనకు ప్రజలే సమాధానం చెప్తారని అన్నారు.
పది సంవత్సరాల పాలనలో తెలంగాణను అప్పులమయం చేసిన బీఆర్ఎస్‌కు నిరసన చేసే నైతిక హక్కు లేదని ఆరోపించారు.
బీఆర్ఎస్ పాలనలో ఏం చేశారు..? ప్రజలే నిలదీయాలి ఇందిరమ్మ ఇళ్లు ఊరూరా ఇచ్చాం..డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఎక్కడ...? బీఆర్ఎస్‌ను ప్రశ్నించాలన్నారు.
కాంగ్రెస్ ప్రజాపాలనలో సంక్షేమం – అభివృద్ధికి పెద్దపీట వేశామన్నారు.
200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఉచిత బస్సు, అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు అందించడం జరిగిందన్నారు.
ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యంగా
72 వేల ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందన్నారు.
మహిళలను బస్సులకు యజమానులుగా చేశామని,
రాజకీయ ప్రయోజనాల కోసమే బీఆర్ఎస్ నిరసనలు
పదేళ్ల పాలనకు లెక్క చెప్పకుండా కాంగ్రెస్‌పై విమర్శలా? అని ప్రశ్నిస్తూ ఎన్నో సంక్షేమ పథకాలు మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేసే నైతిక హక్కు బీఆర్ఎస్ గాని కేటీఆర్ కు లేదని ఉద్ఘాటించారు...రూ.500కే గ్యాస్ సిలిండర్,200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్,మహిళల పేరుతో ఇందిరమ్మ ఇళ్లు,ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకుల యజమానులుగా మహిళా సంఘాలు. స్వయం సహాయక సంఘాలతో బ్యాంకుల అనుసంధానం, వడ్డీ లేని రుణాలు.
మహిళా సంక్షేమం మాత్రమే కాదు...
మహిళా ఆర్థిక సాధికారతే లక్ష్యంగా రేవంత్ రెడ్డి సర్కార్ ప్రగతి దిశగా ప్రయాణిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ పట్టణ నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు ప్రజలు నాయకులు భారీగా పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సు ప్రమాదంపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి.

## బస్సు డ్రైవర్ మృతి తీవ్రంగా కలిచివేసింది.

## క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి ఆదేశం.

నిజామాబాద్ సెప్టెంబర్ 4 ( ప్రజాగళం ప్రతినిధి) జుక్కల్ ఎక్స్ రోడ్ దాటి బిచ్కుంద సమీపంలో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైన ఘటనపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హైదరాబాద్–1 డిపోకు చెందిన బస్సు నంబర్ TS34Z0030 (ఎక్స్‌ప్రెస్), సర్వీస్ నంబర్ బిసికె 3 , హైదరాబాద్ నుంచి బిచ్కుంద వెళ్తుండగా మధ్యాహ్నం 12 గంటల సమయంలో బిచ్కుంద సమీపంలో రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ప్రమాద ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ఎండీ, జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలు, ప్రస్తుతం పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ప్రమాదంలో బస్సు డ్రైవర్ అంజనేయులు బస్సు కింద చిక్కుకుని మృతి చెందడం తనను తీవ్రంగా కలిచివేసిందని మంత్రి పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బస్సులో మొత్తం 13 మంది ప్రయాణికులు ఉన్నారని, వారందరూ సురక్షితంగా బయటపడ్డప్పటికీ కొంతమందికి స్వల్ప గాయాలయ్యాయని అధికారులు మంత్రికి వివరించారు.

గాయపడిన ప్రయాణికులను అంబులెన్స్‌ల ద్వారా సమీపంలోని ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు నాణ్యమైన వైద్యం, మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అవసరమైన అన్ని వైద్య సహాయ చర్యలను తక్షణమే చేపట్టాలని సూచించారు. అలాగే, ఆర్ఎం నేతృత్వంలో అధికారులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించాలని, బాధితులకు అవసరమైన అన్ని విధాలుగా అండగా నిలవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై పూర్తి వివరాలను తెలుసుకుని, బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు.




### మెడకాయ మీద తలకాయ ఉన్నోడు

# ఇంటర్ విద్య తీసేయాలని అనడు.

## సీఎం ప్రకటనలు చూస్తుంటే తుగ్లక్ కూడా సిగ్గు పడే పరిస్థితి.
## ఇంటర్ విద్య పై అసెంబ్లీ లో సీఎం స్పష్టమైన ప్రకటన చేయాలి.
## తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత.

నిజామాబాద్ సెప్టెంబర్ 4 (ప్రజాగళం ప్రతినిధి) మెడకాయ మీద తలకాయ ఉన్నోడు ఇంటర్ విద్యను తీసేస్తానని అనడని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన సేవ్ ఇంటర్ విద్యా జంగ్ సైరన్ సదస్సులో పాల్గొన్న కల్వకుంట్ల కవిత ప్రసంగించారు. ఇంటర్మీడియేట్ విద్య కారణంగా ఎంతో ప్రయోజనం పొందిన వ్యక్తిని నేను మన విద్య వ్యవస్థలో వచ్చిన మంచి మార్పుల కారణంగా ఇంటర్ విద్య వచ్చిందని వ్యాఖ్యానించారు. తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్మీడియేట్ విద్య ఎంతో మెరుగ్గా ఉందని, అందుకే ప్రపంచంలోని అతిపెద్ద కంపెనీల్లో గొప్ప ఇంజనీర్లంతా మనవాళ్లే ఉన్నారని ఆమె అన్నారు. ఇంటర్ విద్య చాలా బాగుందని. దాన్ని మరింత బలోపేతం చేయాలి. కానీ తీసేయాల్సిన అవసరమే లేదన్నారు..ఎలాంటి సమస్య లేనప్పుడు దాన్ని అవసరంగా సమస్యగా మార్చవద్దని ఈ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు. ఇప్పుడున్న కార్పొరేట్ విద్యలో కొన్ని లోపాలు ఉండొచ్చు. కానీ ఇంటర్ విద్య కారణంగానే మనం ప్రపంచంలోనే మేధావులను తయారు చేయగలిగం. మెడకాయ మీద తలకాయ ఉన్నోడు ఇంటర్ విద్య ను తీసేస్తామని అనడు కచ్చితంగా ఈ నిర్ణయాన్ని మేము వ్యతిరేకిస్తున్నాం. ప్రభుత్వం నిర్ణయం మార్చుకునే వరకు మేము పోరాడుతాం. అప్పుడప్పుడు ముఖ్యమంత్రి మాట్లాడుతుంటే భయమవుతుంది వైట్ కాలర్ జాబ్స్ వదిలేసి...బ్లూ కాలర్ జాబ్స్ వెతుక్కోవాలని ఆయన అంటున్నాడు ఇంజనీరింగ్ వేస్ట్ అంటాడు. ఐటీఐ, పాలిటెక్నిక్ తేసేస్తామంటాడు విదేశాల్లో బ్లూ కాలర్ జాబ్ లు అంటే లేబర్ ఉద్యోగాలు వెతుక్కోవాలని చెబుతాడు అసలు ప్రభుత్వాల ఆశయాలు హిమాలయాలంత ఉన్నతంగా ఉండాలే తప్ప పాతాళం అంత లోతుగా ఉండొద్దని హితవు పలికారు. మనం ఉద్యోగాలు కల్పించే వ్యాపారవేత్తలను తయారు చేయాలే గానీ ఉద్యోగాల కోసం వెతుక్కునే వాళ్లను కాదన్నారు. ముఖ్యమంత్రి అనుసరిస్తున్న పోకడను కచ్చితంగా మనం వ్యతిరేకించాలి ఇంటర్మీడియేట్ విద్యను కాపాడాలని పోరాటం చేస్తున్న మధుసూదన్ రెడ్డిని గత ప్రభుత్వం చాలా ఇబ్బంది పెట్టిందన్నారు. అయినా సరే ఆయన ఎంతో ధైర్యంగా పోరాటం చేశారు. ఆయనతో కలిసి ఉద్యమంలో నేను పనిచేశాను ఒక వ్యవస్థను కాపాడాలనే మంచి ఉద్దేశంతో ఇవ్వాళ నేను ఇక్కడకు వచ్చాను అందరికీ మంచి జరుగుతుందని గట్టిగా నమ్మితేనే నేను పోరాటం చేస్తాను. నేను మొండిదాన్ని. ప్రజలకు మంచి జరిగే విషయంలో గట్టిగా పోరాటం చేస్తానని కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. ఇంటర్మీడియేట్ విద్య మనకు అవసరం. దాన్ని అందరం కాపాడుకోవాలన్నారు. ఈ ముఖ్యమంత్రి ప్రకటనలు చూస్తుంటే తుగ్లక్ కూడా సిగ్గుపడుతాడు ఆయన సడెన్ గా ఒక మీటింగ్ లో ఇంటర్మీడియేట్ ప్రవేశాలు ఈ ఏడాది నుంచి తీసుకోమని అంటాడు రెండు రోజుల్లో ఇంటర్ అడ్మిషన్లు అంటూ ఇంటర్మీడియేట్ బోర్డు ప్రకటనలు చేస్తుంది గతంలో పిచ్చి పనులు చేసే పాలకుడిని తుగ్లక్ అనేవాళ్లు. కానీ ఇక నుంచి రేవంత్ రెడ్డి ని అనాల్సి వస్తుందన్నారు. ముఖ్యమంత్రి పదవి అంటే దానికో డిగ్నిటీ ఉంటుంది. ఆ డిగ్నిటీని కాపాడాలన్నారు. ఇలాంటి విధానపరమైన నిర్ణయాలు తీసుకునే ముందు మేధావులు, సబ్జెక్ట్ నిపుణులతో చర్చించాలి. లేదంటే ఆ నిర్ణయాలు ఇలాగే బెడిసి కొడుతాయన్నారు. ఇంటర్ విద్యను తీసేయటం కారణంగా ఆడపిల్లలు చదువుకు దూరమవుతారు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల కారణంగానూ ఆడపిల్లలే చదువుకు దూరమవుతున్నారు. ఆడపిల్లల చదువు విషయంలో ప్రతి అంశం లింక్ అయి ఉంటుంది. అదే విధంగా విద్య విషయంలో ఆడపిల్లలకు ఇబ్బంది అయ్యే నిర్ణయాలు తీసుకోవద్దు నేను ఆంధ్రా, తెలంగాణ విషయంలో చాలా కచ్చితంగా ఉంటానని కవిత స్పష్టం చేశారు. ఈ ముఖ్యమంత్రి విద్యా కమిషన్ పేరుతో ఆంధ్రా వ్యక్తి ఆకునూరి మురళిని ఛైర్మన్ గా వేసినప్పుడే నాకు డౌట్ వచ్చిందన్నారు. కానీ విద్యకు సంబంధించి కమిషన్ కనుక గౌరవించాం కానీ ఆ కమిషన్ మూడేళ్ల పాటు టైమ్ వేస్ట్ చేసి మూడు సిఫారసులు చేసిందన్నారు. ఇంటర్మీడియేట్ పాస్ పర్సెంటేజీ 45 శాతం చేయాలని సూచించింది. అది జరిగే పనేనా? రేవంత్ రెడ్డి ప్రభుత్వమే 39 శాతం ఓట్లతో అధికారంలోకి వచ్చిందా కాదా? అదే రూల్ ఈ ప్రభుత్వానికి అప్లయ్ చేస్తే రేవంత్ రెడ్డి సీఎంగానే ఉండొద్దు కానీ ప్రతి విద్యార్థికి ఒక చెక్ పాయింట్ అనేది ఉండాలన్నారు. ఇక ఇంటర్మీడియేట్ లో వెయిటేజ్ అంటారు. అది టెస్ట్ డ్, ట్రెయిన్డ్, ఫెయిల్డ్ నిర్ణయం గతంలో ఈ విధానం వద్దనుకుంటే మళ్లీ అదే పాత విధానాన్ని ఈ కమిషన్ తీసుకురావాలని చెప్పింది. ఇక ముఖ్యమంత్రి ఏమో ఈ కమిషన్ నివేదికను చెత్తబుట్టలో వేస్తా అంటాడు అలాంటప్పుడు కమిషన్ వేయటం దేనికి? టైమ్ వేస్ట్ చేయటం దేనికి? అని ఆమె ప్రశ్నించారు. ఇప్పుడు మళ్లీ కేకే కమిషన్ అంటున్నారు. ఇప్పటికే మూడేళ్లు టైమ్ వేస్ట్ చేశారు కేకే కమిషన్ రిపోర్ట్ ఎప్పుడు ఇస్తుంది. దాన్ని మీరెప్పుడు అమలు చేస్తారు? మన ఇంటర్మీడియేట్ విద్య అనేది దేశంలోనే నంబర్ వన్ గా ఉంది. దాన్ని ఇంకా బలోపేతం చేయండి మంచిగా ఉన్న సిస్టమ్ మార్చటానికి ఇదేమీ కాంగ్రెస్ పార్టీ కాదు మీ నిర్ణయాలు చూస్తుంటే మీరు నడిపేది సర్కారా? సర్కస్ అని ప్రజలు అనుకుంటున్నారన్నారు. ఈ రాష్ట్రంలో ఫ్రీ ఎడ్యుకేషన్ ఉండాలని నేను గట్టిగా కోరుకుంటున్నానని ఆమె స్పష్టం చేశారు. కానీ చాలా మంది బడ్జెట్ సరిపోతుందా అంటున్నారు. ఇంత తుగ్లక్ ప్రభుత్వంలోనూ మనకు 2 లక్షల కోట్లు ఏటా ఆదాయం వస్తుందన్నారు. అందులో లక్ష కోట్లను విద్య, వైద్యానికి కేటాయించవచ్చు. ప్రపంచం తిరిగి, ఎన్నో కమిటీల్లో పనిచేసిన అనుభవంతో ఇది సాధ్యమేనని తెలుసుకున్న తర్వాతే చెబుతున్నాను కచ్చితంగా ఉచిత విద్య, వైద్యం ఇవ్వవచ్చు. అందుకు ఉండాల్సింది పొలిటికల్ విల్ పవర్ మాత్రమేనన్నారు. విద్య, వైద్యం కోసమే ప్రజలు తమ ఆదాయంలో 70 శాతం ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వమే వాటిని ఫ్రీ గా ఇస్తే ఆ ఆదాయంతో వాళ్ల జీవితాలు ఎంతో మెరుగు అవుతాయి ఇంటర్మీడియేట్ విద్యతో పెట్టుకోవాలని ఆలోచన చేస్తే విద్యార్థుల తల్లితండ్రులతో, కొరివి తో తలగొక్కునట్లే కచ్చితంగా వాళ్లంతా మీ ప్రభుత్వాన్ని పడగొట్టటం ఖాయమన్నారు. ఇంటర్మీడియేట్ విద్యను తీసేయాలన్న ముఖ్యమంత్రి ఈ ఏడాదికి వాయిదా వేస్తున్నామని చెబుతున్నారు కానీ ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ఇంటర్ విద్యను తీసేయమని ఆయన హామీ ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. లేదంటే తెలంగాణ రక్షణ సేన గా మేము ఊరుకోం. ప్రభుత్వ నిర్ణయం మారే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com